
కథ

# చీకటిమూసిన ఏకాంతంలో

వాలి. హిరణ్మయీదేవి



"ప్రతీ ప్రైజ్‌ని తనసొంతం చేసుకొన్న ఈ స్టూడెంట్ పేరు తేజా. ఇంత తెలివైన పిల్లవాడిని చక్కటి క్రమశిక్షణలో పెంచిన అతని తల్లి శ్రీమతి భూజాత గారిని అభినందిస్తున్నాం. కనడం అందరూ చేసే పనే. వారిని తీర్చి దిద్దడంలోనే తల్లిదండ్రుల ప్రతిభ తెలిసేది. తండ్రిలేని తనయుణ్ణి గారాబంతో పాడుచేస్తారు చాలామంది తల్లులు. అలా కాకుండా తండ్రిలేని లోటుని తెలీనీకుండా పెంచి ఇంతటి ప్రతిభాశాలిగా తీర్చిదిద్దినందుకు ఆమెకు ప్రత్యేక అభినందనలు." అంటూ భూజాతను స్టేజిమీదకు రప్పించి పూల బొకే ఇస్తూ, కలెక్టర్ అన్న మాటలు భూజాతను పులకింపచేశాయి.

ఆ తర్వాత హెడ్‌మిస్ట్రెస్, బాబు తేజా వాళ్ల క్లాస్ టీచర్ మాట్లాడిన మాటలు భూజాతకి ఎంతో ఆనందాన్ని కల్గచేశాయి. గర్వంగా, తృప్తిగా తేజా వంక చూసింది.

ఆ మరునాడు, దూరంగా 'ఏ తల్లి నినుకన్నదో నేను నీ తల్లినైనానురా... నా వరాల పంటగా నీవు నా ఇంట వెలిశావురా' అంటూ సుశీల ఆలపిస్తున్న కమ్మటిపాట వినబడుతూ ఉంటే ఆమె మనసు గతంలోకి పరుగు తీసింది.

***

"నాన్నా! బుక్స్ కొనుక్కోవాలి, యాభై రూపాయలు కావాలి." అడిగింది భూజాత.

చిరాగ్గా చూశాడు అనంతరామయ్య.

"నీ మొహానికా చదువొక్కటే తక్కువ. నా దగ్గర పైసా లేదు" అంటూ బైటకెళ్లిపోయాడతను.

దిగులుగా కూర్చుండిపోయింది భూజాత. ఆమె పుట్టిన వెంటనే తన భార్య పోయిందన్న కోపంతో భూజాతని నిర్లక్ష్యం చేస్తుంటాడు. ఆ పిల్ల మొహం చూడటానికే ఇష్టపడడు. అందుకే సాధ్యమైంతవరకూ తండ్రిని తప్పించుకునే తిరుగుతూంటుంది భూజాత కూడా. "ఏంటలా కూర్చున్నావ్? బాబు బురదలో ఆడి ఒళ్లూ, బట్టలు పాడుచేసుకొన్నాడు. వాడిక్కాస్త స్నానం చేయించు. పాలు చల్లార్చి ఉంచాను. పాప బాటిల్ వేణ్ణీళ్లతో కడిగి అందులో అవిపోసి ఉంచు" అంటూ హుకుం జారి చేసిందామె పెద్దక్క లలిత.

భూజాతకు ఆ లలితంటే ఒళ్లుమంట. ఇంటికి పెద్దది అయినందుకు, పుట్టగానే అమ్మని కోల్పోయినందుకు తనని అమ్మలా ఆదరించాల్సిందిపోయి. ఓ పనిపిల్లలా వాడుకొంటూన్నందుకు.

పెద్ద కూతురంటే అనంత రామయ్యకు ప్రేమ. పక్క ఊరిలోనే ఉండే ఆమె తన భర్తా పిల్లలతో సంవత్సరంలో ఎనిమిదినెలలూ పుట్టింట్లోనే గడుపుతుంది. స్వార్థం పాలెక్కువ. ఎంతసేపూ తనకీ, భర్తకీ, తన పిల్లలకు అన్నీ అమిరాయో లేదో చూసుకొంటూ ఉంటుంది. అంతే.

"ఏంటే అట్లా ఉన్నావ్?" అడిగింది సునీత. ఆమె భుజాతకు రెండో అక్క. మరీ లలితంత స్వార్థపరురాలు కాకపోయినా కాస్త ఆమెకన్నా నయం. "చిన్నక్కా! బుక్స్ కొనుక్కోడానికి డబ్బులడిగితే నాన్న ఇవ్వలేదు. రేపటికల్లా నోట్స్ కంప్లీట్ చేసి పట్టుకు రమ్మన్నారు. ఎప్పుడు తేవాలి. ఎప్పుడు రాయాలి. రేపు టీచర్ ఏమంటుందోనని భయంగా ఉంది. కళ్లనీళ్లతో చెప్పింది.

"ఎంత కావాలి?" అడిగింది సునీత.

"యాభై. కొద్దిగా భయపడుతూ చెప్పింది భూజాత.

"సరే. నేనిస్తాగానీ నీ నోట్సులు రాసుకోడం కాగానే కాస్త నా బట్టలు ఇస్త్రీ చేసి ఇవ్వాలి. ఎల్లుండి నే వెళ్లిపోతున్నాగా" అంది సునీత.

"సరే, అలాగే చేస్తాను" ఆనందంగా చెప్పింది భూజాత.

రోజులు దొర్లిపోతున్నాయ్.

"అన్నయ్యా! నాకు... నాకు ఇంకా చదువుకోవాలని ఉంది" మెల్లగా అడిగింది భూజాత, పడక్కుర్చీలో కూర్చున్న భరత్ దగ్గరికొచ్చి. తండ్రికి చెప్పినా లాభం లేదని. ఎక్కడ్నుండి విన్నదో గానీ రయ్యిన వచ్చేసింది శ్యామల.

"ఎందుకు తల్లీ! ఇంటర్ పాసయ్యావుగా, చాల్లే! ఇప్పటికే డిగ్రీ చేసిన మొగుడు కావాలంటున్నావ్. నువ్ డిగ్రీ చేస్తే ఇంకా ఎక్కువ చదివినవాణ్ణి

తేవడం మా వల్లకాదు."

"కాలేజీకి వెళ్లను, అన్నయ్యా! ప్రైవేట్‌గా ఇస్తాను సరేనా!" ఇంకా ఆశచావక అడిగింది భూజాత.

"చూద్దాం!" అన్నాడు భరత్.

"ఏంటి చూసేది? మావాళ్లు చెప్పిన సంబంధానికి ఖాయం చేయండి తక్కువలో అయిపోతుంది. లేకుంటే వేలకి వేలు పోయాలి. " అంది శ్యామల, తన మాటకు తిరుగులేదన్నట్లు.

"ఏంటి మొన్న వచ్చి వెళ్లిన వాళ్లకా? అతనికి ఏజ్ ఎక్కువగా ఉన్నట్లుంది చూస్తూ చూస్తూ..."

"కాస్త వయసు ఎక్కువైతేనేం? కట్నం వద్దంటున్నాడుగా. అయినా మీ నల్లటి చెల్లెలి అందానికి ఆయనేం తీసిపోడులే" అంది శ్యామల కోపంగా.

భరత్ ఇక ఏమీ మాట్లాడలేకపోయాడు. భూజాత ఏడ్చి మొత్తుకొన్నా ఆ పెళ్లిని తప్పించుకోలేకపోయింది. ఫలితంగా రాఘవ భార్య అయింది.

పెనం మీదనుండి పొయ్యిలోకి పడటం అంటే ఏంటో అనుభవంలోకి వచ్చింది భూజాతకు పెళ్లితో.

కాస్త ఛామనఛాయ అయినా చక్కటి కనుముక్కు తీరుతో పొందిగ్గా ఉన్న శరీర సౌష్ఠవంతో ఉండే భూజాతది, చూడగా చూడగా ఇంకా చూడాలన్పించే అందం. అందులోనూ అందవిహీనుడైన రాఘవ పక్కన మరింత అందంగా కన్పించేది. 'ఇంత చక్కటి అమ్మాయికి ఇతడా భర్త" అన్న భావం మెదిలేది చూసేవారికి. ఆ భావం స్పష్టంగా అర్థమయ్యేది రాఘవకి. దాంతో ఆమెపట్ల 'అనుమానం' మొదలైంది. ఆమె ప్రతికదలికలో తప్పులు వెదికి చూపిస్తు ఆమెని తిడుతూ కొడుతూ తన అహాన్ని చల్లార్చుకొనేవాడు రాఘవ.

ఏ రోజుకైనా 'మంచిరోజనేది' రాకపోతుందాని ఎదురు చూసేది భూజాత కానీ ఆ 'రోజు' రానేలేదు. క్రమంగా నిర్లిప్తతతకు మారుపేరయింది భూజాత.

"ఛీ! నీ మొహం చూస్తే ఉన్న కోరిక చప్పగా చల్లారుతుంది." అంటూ అడ్డమయిన తిరుగుళ్లకే అలవాటు పడ్డాడు రాఘవ. తెచ్చిన జీతం ఇచ్చేవాడు కాదు. ఇంటికి అవసరమైన వెచ్చాలకే పదిసార్లు చెప్పాల్సి వచ్చేది భూజాతకి. అక్కడికీ ఓ పూట తింటే మరోపూట పస్తన్నట్లుగానే గడిపేది.

చేతిలో డబ్బులైపోయినపుడో, బైటకు వెళ్లే పరిస్థితి లేనప్పుడో భూజాత శరీరం కావలసివచ్చేది రాఘవకు.

అతడితో ఆ అనుభవం పంచుకోవాలంటే భయంగా ఉండేది భూజాతకి. అసలే మొరటు మనిషి మోటుగా ఆమెని నలిపేసేవాడు. అతడివల్ల ఏ జబ్బులు అంటుకొంటాయో నన్న భయంతో ముడుచుకు పోయేది భూజాత.

ఒకరోజు ప్రొద్దుటే కళ్లు తిరిగి పడిపోయింది భూజాత. పక్కింటామె హాస్పిటల్‌కి బలవంతాన లాక్కెళ్లింది. పరీక్షలయ్యాక 'భూజాత' తల్లి కాబోతుందని తేల్చింది డాక్టర్. ఆ మాటకు ఆనంద విషాదాలు సమపాళ్లలో కలిగాయి భూజాతకు. పిల్లో, పిల్లాడో పుడితే రాఘవలో ఏ మార్పన్నా వస్తుందేమోనన్న ఆశ. అతడు మునుపటిలాగే ఉంటే అనవసరంగా మరొక ప్రాణిని బాధ పెట్టాల్సి వస్తుందేమోనన్న దిగులు. ఇలా ఆశ నిరాశల మధ్య నాలుగు నెలలు గడిచాయి.

ఆ రోజు పూటుగా తాగివచ్చాడు. రాఘవ. కారణం అతడ్ని ఉద్యోగంలోంచి తీసేయడం. ఆనందానికి, దుః ఖానికి కూడా అతడు సెలబ్రేట్ చేసుకొనేది ఆ తాగుడుతోనే మరి. అన్నం పెట్టి చింతకాయ పచ్చడి పక్కనుంచింది భూజాత. ఆమె తన ఆకలిని చంపుకొని మరీ ఆ అన్నాన్ని అతడికి దాచి ఉంచింది. ఆ కంచాన్ని చూడగానే అతడిలో రాక్షసుడు నిద్రలేచాడు. "ఛీ! దరిద్రపుదానా! అలసి సొలసి వచ్చే మొగుడికి కమ్మగా ఇంత మటనో, చికెనో వండి పెట్టాలని తెలీదూ?" అంటూ బలంగా తన్నాడు కడుపుమీద.


ఉంగలు చుట్టుకొని పడిపోయింది భూజాత. అసలే సరైన పోషణకు నోచుకోకుండా ఉన్న ఆమెకు క్షణాలమీద అబార్షన్ అయిపోయింది. ఆమె కర్మానికి ఆమె నొదిలి వెళ్లిపోయాడు రాఘవ. పక్కింటామె తోడుగా నిలబడి హాస్పిటల్‌కి తీసుకెళ్లింది. మరణం చివరి అంచువరకూ వెళ్లి తిరిగొచ్చింది భూజాత.

వారాలు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా మారుతున్నా రాఘవలో మాత్రం మార్పులేదు. అక్కడా ఇక్కడా ట్యూషన్స్ చెప్పి ఆమె తన కడుపుకి ఓ పూట తిండిని అమర్చుకోగలిగేది. ఒక్కోసారి అదీ దక్కకుండా అర్థాంతరంగా ఊడిపడి గిన్నెలో ఉన్నదేదో ఊడ్చుకు తినేసేవాడు రాఘవ. ఆమె అక్కడా, ఇక్కడా దాచిన డబ్బులు దొంగతనం చేసో, లేక దొరికిన చెంబో, తప్పాళానో అమ్మేసి తాగేసి రావడం. ఆ దుర్వాసనతో పక్కకు చేరి గుర్రుపెట్టి నిద్రపోయే అతడిని చూసినపుడు, ఎన్నోసార్లు అసహ్యంతో భరించరాని బాధతో, ఆవేశంతో అతడి తలమీద ఏ రుబ్బురాయో ఎత్తేయాలన్పించేది భూజాతకు.

## బిపాశాబసు మీద కేసు

అలోక్ శ్రీవాస్తవ 'జానే క్యా హోగా' (ఏం జరుగుతుందో ఏమో?) చిత్రనిర్మాత. అందులో అఫ్తాబ్ శివదసాని, బిపాశాబసు, ప్రీతీ ఝాంగియానీ చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన చిత్రమిది. ఈ చిత్రం ప్రారంభించాక బిపాశ, చాలా సార్లు తనకు వీపు నొప్పిగా వుందనో, బాయ్ ఫ్రెండ్ దీనోకు ఆక్సిడెంట్ అయింది కనుక ఢిల్లీ వెళ్లాననో తన సెక్రెటరీతో ఫోనులో చెప్పించేది. లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుని సెట్లు వేసుకుని కూర్చుని వుండేవాడు, నిర్మాత అలోక్. అంతే కాదు, షూటింగులో పాల్గొనేందుకు ఓం పురి, నసీరుద్దీన్ షా, జాకీష్రాఫ్ వంటి పెద్దనటులు టైముకు వచ్చేవారు. అయినా బిపాశ జాడ మాత్రం వుండేది కాదు. తనకు బిపాశ కలిగించిన నష్టానికి పరిహారం ఇవ్వాలని కోర్టులో కేసు పెట్టాట్ట అలోక్.

ఎన్.



మరు నిమిషంలో తన ఆలోచనకి తనే భయపడేది. వీడివల్ల తను ఎప్పటికైనా హంతకురాలిగా మారిపోతానేమో నన్న ఆలోచన ఇటీవలగా ఆమెకు పట్టి పీడిస్తున్నది అతడి వికృతరూపం, అంతకంటే వికృతమైన మాటలు అతడి పట్ల ఏహ్యాభావాన్ని మరింతగా పెరిగేలా చేయసాగాయి. ఎంతవద్దనుకున్నా ఆమె మనసు, అతడి నంతమొందించే ప్రక్రియల గురించే ఆలోచించేది. దాంతో ఆమె ద్వైదీభావాలతో సతమతం కాసాగింది. ఈ పరిస్థితుల నుంచి ఆమెని ఒడ్డున పడేయడానికా అన్నట్లు లారీ ఆక్సిడెంట్లో మరణించాడు రాఘవ. అతడి నుజ్జు నుజ్జయిన శరీరాన్ని చూసినా ఆమె కంట్లోంచి ఒక్క చుక్కా చిందలేదు. అప్పుడైనా ఓదార్చలేదామెని అనంతరామయ్య. అత్తింటివారెవరూ బాధ్యత తీసుకోకపోవడంతో, అన్నా వదినల పంచన చేరక తప్పలేదు భూజాతకు. మళ్లీ దూషణ ఛీత్కారాలే ఆమెకు లభించసాగాయి, జీతభత్యాలకు బదులు. లలిత ఒక్కనాడూ వచ్చి పలుకరించలేదు. ఇంతలో సునీత మూడోసారి నెలతప్పడంతో "మనిషి తోడు అవసరం అంటూ భూజాతను తనింటికి తీసుకెళ్లింది. సునీత డెలీవరి అయి, పుట్టిన బాబుకి మూడోనెల వచ్చేవరకూ భూజాత వాళ్లింట్లో ఉండిపోయింది. సునీత భర్త భూజాతకు చదువుమీద ఉన్న శ్రద్ధ చూసి ఆమె ప్రైవేట్‌గా డిగ్రీ చేసేందుకు, టైప్, షార్ట్ హాండ్‌లు నేర్చుకొనేందుకు ప్రోత్సహించాడు. ఆమాత్రం ప్రోత్సాహం, ఆదరణలకే భూజాత పొంగిపోయింది. డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు టైప్, షార్ట్‌హాండ్‌లలో కూడా ప్రతిభ చూపించింది.

నానాపాట్లు పడి, పరీక్షలు రాసి రాసి, ఎట్టకేలకు మంచి ఉద్యోగాన్ని సంపాదించుకోగల్గింది భూజాత. మొదటి నెల జీతం అందుకొన్న రోజున ఆమె ఆనందానికి అంతే లేదు. అది డబ్బును చూసిన ఆనందం కాదు. 'తన కాళ్లమీద తను నిలబడగలిగానన్న' ఆత్మవిశ్వాసం వల్ల. మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి.

ఓ రాత్రి, తన శరీరంపై మరో శరీరం పడ్డ బరువుకి ఇట్టే మెలకువ వచ్చింది భూజాతకి కళ్లు తెరిచి చూసి, తనమీద పడ్డది తననింతకాలం తోబుట్టువులా ఆదరించిన చిన్న బావదని తెలుసుకోగానే అప్రతిభురాలైంది.

"యూ 'టూ' బ్రూటస్ అన్నట్లుగా తనవంక చూస్తోన్న ఆ చూపుల నెదుర్కోలేక తోక ముడిచాడతను.

మళ్లీ భూజాతలో ఆలోచనలు. విషయం ఇదీ



### అభీని ఓదార్చిన సంజూబాబా!

మొన్న ఫిబ్రవరి నెల ఐదో తారీఖున తన పుట్టినరోజైనప్పటికీ, అభిషేక్ బచ్చన్ పాపం, మూడ్‌లో లేడట. ఓ పక్క జరగబోయిన పెళ్లి కాస్తా అగి కూర్చుంది. మరిం కెలా గుంటాడు? ఆ రోజు తన అభిమాననటుడైన సంజయ్ దత్ ఇంటికి వెళ్లాట్ట. అక్కడ వాళ్లిద్దరూ చక్కగా గడిపారు. తిరిగొచ్చేటప్పుడు అభీ, మారిన మూడ్‌తో హాయిగా కారు తోలుకుంటూ వెళ్లాట్ట. ... అనంతకోటి ఉపాయాలు మరి!

ఎన్.

అని చెబితే అక్క ఏం అనుకొంటుందోనని. ఇంట్లోంచి వెళ్లిపోతే 'రెక్కలురాగానే ఎగిరిపోయిందని' ఈసడిస్తారేమోనని, అక్క మొహం చూసి మౌనంవహిస్తే దాన్ని అలుసుగా తీసుకొని చిన్నబావెంతకి తెగిస్తాడోనని.

ఫలితం ఆఫీసు పనిలో తప్పులెక్కువగా దొర్లసాగాయి. ఆమె కొలీగ్ మధు గమనించి "భూజాతగారూ! మీకేమయినా ప్రాబ్లెమ్స్ కొత్తగా వచ్చి పడుతున్నాయా?"అంటూ అడిగాడు. అతడికి చూచాయగా ఆమె బాధలు తెలుసు. "అబ్బే ఏం లేదు" తడబడుతూ చెప్పింది.

"నా ఫ్రెండొకడు మన బ్రాంచికి ట్రాన్స్‌ఫరవ్వాలని ప్రయత్నిస్తున్నాడు మీరు వైజాగ్‌కి వెళ్లడానికిష్టపడితే చెప్పండి నేనా ఏర్పాట్లు చూస్తాను" అన్నాడు.

ఏమీ మాట్లాడలేకపోయింది భూజాత.

ఆ రాత్రి, బాగా దాహంగా అనిపించి వంటింట్లోకి మంచినీళ్లకని వెళ్లింది భూజాత. నీళ్లు తాగి తనగదిలోకి వెడుతూ, అక్కా బావల, మాటలూ, అందులోనూ ... తన పేరే ప్రస్తావనకి రావడంతో చెవులు రిక్కించి వినక తప్పలేదు భూజాతకి.

"మీరేంటండి ఇంత అసమర్థులు మొగుడిపోయిందాన్ని లొంగదీసుకోలేక పోవడం ఏంటి? ఎలాగోలా లొంగదీసుకొంటే అదెప్పటికీ ఇక్కడే పడి ఉంటుంది. ఇక దాని సంపాదన ఎప్పటికీ మనదే అవుతుంది" అంటోంది సునీత.

తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది భూజాత.

"భూజాతను చూస్తే ఆ అభిప్రాయం కలగదు. ఓ చెల్లిలా అనిపిస్తుంది." సంజాయిషీగా చెబుతున్నాడు చిన్న బావ. భూజాతకి కళ్లలో నీళ్లు తిరిగాయి. సొంతక్క అయి ఉండీ సునీతలో అలాంటి సున్నిత భావం లేకపోయినందుకు. పెద్దక్కను మించిన స్వార్థ పరురాలీమె అని తెలియడంతో ఆ మరుసటి రోజే మధుతో చెప్పేసింది. "వైజాగ్‌కి వెళ్లడం ఇష్టమేనని" మధు ఏ పాట్లు పడ్డాడో గానీ, రెణ్నెళ్లు తిరక్కముందే, భూజాత వైజాగ్‌లో కాలుపెట్టింది.

వెళ్లిన నెల్లాళ్లకి "అరకులోయ, సింహాచలం చూడ్డానికి వచ్చా" మంటూ లలిత కుటుంబం అంతా భూజాత ఇంటికెళ్లారు.

"ఏంటి? జీతమెంత ఇస్తారు? ఎంత ఖర్చవుతోంది, ఎంత మిగుల్తోంది?" లాంటి ప్రశ్నలు తప్ప, "ఇక్కడి నీళ్లు బావున్నాయా ఇల్లదీ సదుపాయంగా ఉందా? ఆఫీస్ వాతావరణం ఎలా ఉంది?" లాంటి ప్రశ్న ఒక్కటయినా ఆమె నోటినుండి రాకపోవడం గమనించిన భూజాత రెండ్రోజులు కాగానే చెప్పేసింది.

"మా ఇంటి ఓనర్ నేనొక్కదాన్ని కాబట్టి ఈ గది అద్దెకిచ్చాడుట. ఇలా ఇంతమంది మెంబర్స్ ఉంటే వీల్లేదంటున్నాడూ" అని. భర్తకి ఆఫీస్ వాళ్లిచ్చే హోటల్‌రూమ్ రెంట్, భోజనాల ఖర్చు మిగుల్చుకోవచ్చని ప్లాన్ చేసిన లలితకు ఎక్కడలేని కోపం వచ్చింది.

"ఏదో చెల్లెలివని చూసి పోదామని వచ్చాను గానీ.." అంటూ ఓ గంట దండకం వల్లించింది.

"నేను పుట్టింట్లో అన్ని బాధలు పడుతున్నప్పుడూ, మొగుడుపోయి బాధ పడ్తున్నప్పుడు, అన్నావదినల పోషణలో అల్లాడుతున్నప్పుడు నేను గుర్తు రాలేదెందుకు?" ఇక ఆగలేక అంది భూజాత.

దానికి మరో గంట సుత్తివేసి వెళ్లింది లలిత.

"అబ్బ గులకరాళ్లు డబ్బాలో వేసినట్లే మాట్లాడుతుందేంటి ఆవిడ?" అంది ఇల్లుగలావిడ.

దానికేమీ బదులీయలేదు భూజాత కానీ మనసులో అనుకొంది. నీ గొంతూ అందుకేం భిన్నంగా లేదు" అని.

***

భూజాతకిక్కడి ఆఫీసు వాతావరణం ఏమాత్రం నచ్చలేదు. 'అధిక చనువు తీసుకొని మాట్లాడ్డం, లేదా చూపుల బాణాలతో గాయం చేసేయడం వీళ్ల కలవాటులా ఉంది' అని మాత్రం అనుకోకుండా ఉండలేకపోయింది.

"మీకు భర్త పోయాడట కదా. మరి బొట్టు పెట్టుకొంటున్నారే?" అడిగేసారో ఇద్దరు.

"అది ఆయన్తోపాటూ వచ్చింది కాదు గదా!" అంది భూజాత. మునుపట్లా గాకుండా మాటకి మాట అంటించడం నేర్చుకొందామె. అమాయకత్వం స్థానాన్నే ఇపుడు పుందాతనం కొత్తగా వచ్చి చేరింది. స్టాఫ్‌లో ఎవరన్నా వెకిలి వేషాలేస్తే పై వాళ్లకి రిపోర్ట్ ఇస్తే సరి. అనుకొన్న భూజాతకి ఆమెపై అధికారే అలాంటికోవకు చెందినవాడు అయ్యేటప్పటికి ఏం చేయాలో పాలుపోలేదు.

టీకి రమ్మనడం, "సాయంత్రం అలా బీచ్‌కి వస్తారా? అనడగడం మొదలై వాళ్లావిడ ఇంట్లో లేదని పిలవడం వరకూ వచ్చాయి. అందరిలోకి భిన్నంగా ఉండి పనుంటే తప్ప మాట్లాడని ముకుందంతో మాత్రం భూజాత అప్పుడప్పుడు తన కష్టాల్ని చెప్పుకొనేది. అతడూ తనకు తోచిన పరిష్కారానికి సూచించేవాడు.

ఓసారి ఉన్నట్లుండి అడిగాడతను "మీరు మరో పెళ్లి ఎందుకు చేసుకోకూడ"దని. అన్నా వదినలు తననేనాడో వదిలించుకొన్నారు. పెళ్లి చేసుకోవాలని ఉన్నా తనని పెళ్లాడేందుకు ఎవరు ముందుకొస్తారు? అంత పట్టించుకొని చేసేవారు మాత్రం ఎవరున్నారని అనుకొంది విరక్తిగా. కానీ ఏ తోడేలు చూపు తనని స్పర్శించినా ఆమె మనసు 'అండగా' నిలబడే తోడుకోసం వెంపర్లాడేది. అటువంటి బలహీనక్షణాలలోనే ముకుందాన్ని తనకో తోడుగా ఉండమని పెళ్లి అనే పాశంతో బంధించనని, కలిసి ఉందామని అడిగింది.

ముకుందంతో కలిసి మొదలుపెట్టిన జీవితం కొత్తలో బాగానే సాగింది. ఈ విషయం తెలిసి ముకుందం, భార్యా, పిల్లలు, వారి చుట్టాలు 'దండయాత్ర' మొదలుపెట్టగానే మాత్రం బెంబేలెత్తిపోయింది.

"మంచం ఎక్కి కొట్టుకొంటున్నావా? అందుకు నా మొగుడే కావల్సి వచ్చాడా" అని ముకుందం భార్య అన్న మాటలు పదే పదే మనసుని గాయపరచసాగాయి. "లోకంలో ఆ ముకుందంగాడే పెద్ద పోటుగాడా? మేమూ చేవ ఉన్నావాళ్లమే" అంటూ వెంటపడి వేధించేవారితో వేగలేక, సూసైడ్ చేసుకొందామన్న నిర్ణయంతో సముద్రం దిశగా నడవసాగింది భూజాత.

ఇంతలో ఆమె ఎదురుగా కారు రాష్‌గా పోవడం, ఎవరో దారిన పోయేవ్యక్తి ఓ ఐదేళ్ల కుర్రాడిని వెంట్రుకవాసిలో పక్కకు లాగేయడం జరిగాయి. దెబ్బలు తగిలిన కుర్రాడు ఏడుస్తూంటే ఎవరిదారిన వారే పోసాగారు. "నన్ను బతకానివ్వరు చద్దామంటే చావానివ్వరు" అని ఏడుస్తూ వాడన్న మాటలకు నివ్వెరపోయింది భూజాత. ఆమె, అంతవరకూ కారువాడే నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ వెళ్లాడని అనుకొంది. అందుకే మళ్లీ వెనక్కి అడుగులు వేసి ఆ పిల్లాణ్ణి సమీపించి "నువ్వు... నువ్వు కావాలని కారు కింద పడాలనుకొన్నావా?" అనడిగింది అపనమ్మకంగా. దానికి వాడు తాను అనాథనని అడుక్కుతింటూ బతుకుతున్నానని చెప్పాడు. "ఛీ అడుక్కోడం తప్పుకాదూ" అంది భూజాత. "కష్టపడి పనిచేయాలని ఓ హోటల్లో చేరాను ఇదుగో చేతులిలా తయారయ్యాయ్" అంటూ పుండ్లుపడ్డ అరచేతుల్ని పాదాల్ని చూపించి, వలవలా ఏడ్చాడు. భూజాత మనసు కరిగిపోయింది. అంతే ఆ క్షణంలో నిర్ణయించుకొంది. చీకటి మూసిన ఏకాంత జీవితంలోకి ఆ దేవుడు పంపిన అసలైన తోడు వాడేనని, వాడికి తల్లిగా మారి తన బ్రతుక్కి వాడి బ్రతుక్కి ఓ పరమార్థం సాధించాలని.

కోరి ట్రాన్స్‌ఫర్ చేయించుకొంది. నుదుటిబొట్టు చెరిపేసింది. బాబుకి తల్లిగా విధవదా ఓ క్రొత్త ప్రాంతంలో కాలుమోపింది. బాబుకి క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పసాగింది.

"కొడుకంటే భూజాత కొడుకులా ఉండాలి' అనేంత ఆదర్శంగా బాబు తేజాని తీర్చిదిద్దసాగింది. ఇప్పుడామెకి ఇంటికి రాగానే బాబు ఎదురొస్తాడు. తన ముద్దు ముద్దు మాటల్ని విన్పించి మునుపటి నిశ్శబ్దాన్ని పారదోలుతున్నాడు. విధవగా, ఓ బిడ్డడికి తల్లిగా ఆమెకి సంఘంలో ఓ గౌరవ స్థానం లభించడం అన్నిటికన్నా తృప్తినివ్వసాగింది. అలా చీకటిని పారదోలి ఓ చిరుదివ్వెని వెలిగించుకొంది.

"అమ్మా! అమ్మా!" అంటూ తనని ప్రియమారా చుట్టేస్తూ తేజా పిలిచిన పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది భూజాత.

"ఏంటి నాన్నా! స్కూల్‌నుండి రావటం, ఆటలాడటం అన్నీ అయ్యాయా! పద స్నానం చేసి, భోంచేద్దూగానీ" అంది ప్రేమగా.

"అమ్మా! పుట్టిన రోజున ఓ మాంఛి పని చేయాలంటావ్‌గా, మామూలు రోజుల్లో చేయకూడదా?" అడిగాడు తేజా.

"మంచిపనికి ఓ ముహూర్తం అంటూ అక్కర్లేదుగానీ, విషయం ఏమిటి?" అంది భూజాత. పాపం ఓ తాత ఎవరో రోడ్డుమీద పడిపోయి ఉన్నాడమ్మా. బాగా జ్వరం ఉందేమో ఒకటే వణుకుతున్నాడు. అందరూ చూసిపోతున్నారే గానీ, ఎవరూ పట్టించుకోడంలేదు. అమ్మా! పాపం ఆ తాత ఒంటరిగా ఉండటం బాలేదమ్మా, మనం వెళ్లి ఆ తాతని తెచ్చుకొని పెంచుకొందామా?" ఆశగా తల్లివంకే చూస్తూ అడిగాడు.

నిలువెత్తు మానవత్వానికి నిదర్శనంగా తేజా కన్పిస్తూంటే మరింత గర్వం కల్గింది భూజాతకి.

"పద, వెడదాం" అంది. ఇద్దరూ వెళ్లారు. చిక్కిశల్యమైన ఆ ముసలి వ్యక్తిని తన తండ్రిగా గుర్తించగానే క్షణంపాటు నోటమాట రాలేదు.

భూజాతకి తన పట్ల అతడు చూపిన పక్షపాత వైఖరి నిర్లక్ష్యం గుర్తుకువచ్చి కదలబోయింది గానీ, అపకారికి ఉపకారము నెపమెన్నక చేయడం లోనే అసలైన విజ్ఞత ఉందని గ్రహించి ఆ ప్రయత్నం విరమించింది. అతడెలాంటివాడైనా తనకీ జన్మనిచ్చిన మనిషి. 'తండ్రిగా కాకున్నా ఓ వృద్ధుడికి అతడి అంతిమదశలో తోడ్పాటునందిస్తే సరి. అనుకొంటూ అతడికి చేయందించింది. తేజా కళ్లలో మెరిసిన మెరుపులు ఆమెకి మరింత సంతృప్తిని కల్గించాయి. ■



## సహారా టీవీకి రేఖ

బాలీవుడ్‌లో నటుడు దేవ్ ఆనంద్ తరువాత రేఖను ఎవర్ గ్రీన్ నటిగా అనుకుంటారు. పదేళ్ల క్రితం ఎలా వుందో నేటికీ రేఖ అలా వుండటమే దాని క్కారణం. ఇప్పుడు రేఖ, సహారా టీవీలో ఓ 'టాక్ షో' చేయాలని మహాఉత్సాహపడుతోందట. సహారా వారు కూడా హీరోయిన్ల పట్ల కాస్త లిబరల్‌గానే వుంటున్నారు. ప్రతి ఫ్లాప్ హీరోయిన్‌కూ సహారా వారు 'సహారా' (చేయూత) ఇస్తూ తమ పేరు నిలుపుకుంటున్నారని కొంద రనుకుంటున్నారు. మునుపే శ్రీదేవి, కరిష్మాకపూర్‌ల కెరీర్ గ్రాఫ్ ఎటూ కాకుండా పోతున్నప్పుడు చేయూత నిచ్చి ఆదుకున్నారు. ఇప్పుడు రేఖకు కూడా తమ స్నేహహస్తం చాచారు. కొంపదీసి ఈ ఛానెల్ కౌన్సిల్ డైరెక్టర్ అమితాబ్ బచ్చన్ కాదు కదా? అని కొందరు చెవులు కొరుక్కుంటున్నారు.

ఎస్.